# నేను చూసిన చిట్టితల్లి

సోమరాజు సుశీల



## కథ



సెమినారుందని చెప్పి హైదరాబాదులో నాకు నచ్చిన ఫ్రెండ్స్‌ని కూడగట్టుకుని తిరుపతి యాత్ర తలపెట్టాను. మొత్తం ముగ్గురం తేలాం. వాళ్ళిద్దరూ నాకన్నా చిన్నవాళ్ళు. ఇంట్లోవాళ్ళు కాదు కదా నేను చెప్పినట్లు వింటారులే అని ధైర్యంగా బయలుదేరాను. యూనివర్సిటీలో సెమినార్ రెండు రోజులకు అయిపోగానే సాయంత్రం కొండ మీదకు వెళ్ళిపోయాం. సెమినార్ వాళ్ళే మాకు కొండ మీద వసతి, తేలిక దర్శనం ఏర్పాట్లు చేసారు. అసలు నాలాంటి వాళ్ళు సెమినార్లకి వెళ్లేదే అందుకు. ఆ పేరు చెప్పి దైవ దర్శనం చేసుకోవచ్చని! లేకపోతే అలాంటి సమావేశాల్లో చెప్పేవాళ్లకీ వాళ్ళ సిద్ధాంతాల మీద నిబద్ధత వుండదు. వినేవాళ్ళకంతకన్నా వుండదు. ఏదో! మర్యాదగా నిధుల వినియోగం జరుగుతుంది. మన జన్మపత్రిలో ఇంకో రెండు వాక్యాలు జమవుతాయి.

తెల్లవారుజామున లేచి అర్చనానంతర దర్శనం చేసుకుని, సుష్టు పూర్తిగా ప్రసాదాలు బొంచేసి కొండ దిగేటప్పటికి పన్నెండయింది. అలివేలు మంగాపురం నారాయణవనం, గోవిందరాజుల గుడి చూసి సాయంత్రం ఆరుగంటలకి నారాయణాద్రిని అందుకోవాలన్నది మా ప్రయత్నం. ఆ విధంగానే ట్యాక్సీ మాట్లాడుకున్నాం. కొండ దిగగానే ముందు మంగాపురం వెళ్ళిపోయాం. నాతో వచ్చిన వాళ్ళిద్దరికీ ఎంత షాపింగు పిచ్చంటే అండమాను వెళ్ళినా ఏదో ఒకటి కొంటేగానీ ఫ్లైటు ఎక్కరు. మరి వెళ్ళింది తిరుపతాయె. మంగాపురం వెడితే గాజులు కొనకుండా రాకూడదటగదా! ఇంక అక్కడ రకరకాల గాజులు మాతో తిరుపతికి రాని బంధుమిత్రులందరి పేరు చెప్పి కొనేటప్పటికి రెండయింది. వాటికి తోడుగా నా సొంతానికి ఒక చిన్న మజ్జిగ కవ్వం, ముగ్గుల గొట్టం, చందనం కర్ర, కజ్జికాయ చెక్క (ఇది అప్పటికే నేను చేర్చిన ఎనిమిదో సెట్టని ఇంటికొచ్చాక పనిపిల్ల చెప్పింది) అన్నీ కొని తిన్నగా నారాయణవనం కూడా చూసుకుని గోవిందరాజుల గుడికి చేరాం. దర్శనం అయిందనిపించుకుని బయటవుండే షాపుల మీదకి దండెత్తాం. ఇత్తడి సామాన్లంటే ఆడవాళ్ళకి కలిగే ప్రేమాభిమానాలని కంట్రోలులో వుంచేందుకు ఇప్పటి వరకూ ఏసైంటిస్టూ మందు కనిపెట్టలేదు. అక్కడ మిలమిల మెరిసే సామాన్లు మనల్ని ముందుకు అడుగేయనీయవు. ఆ దుకాణాల వాళ్ళు మన బేరాలు తెమలనీయరు. ఇలాంటి చోట్లో కాస్త ప్రభుత్వంవాళ్ళు పూనుకుని రేట్లు నిర్ణయించి లేబిల్సు వేస్తే బేరాలు తక్కువ, అమ్మకాలు ఎక్కువ జరుగుతాయేమో. జీవితమంతా కలిసిబతికే వాళ్ళనే నమ్మలేని రోజులివి. షాపు వాళ్ళ కబుర్లు ఎలా నమ్మగలం!

ఇంకా మా బేరాలు జీళ్ళపాకంలా సాగుతూ వుండగానే టాక్సీడ్రైవరు పరిగెత్తుకుంటూ వచ్చి ''అమ్మా! ఆరవుతోంది'' అని మా తక్షణ కర్తవ్యం గుర్తుచేశాడు. వెంటనే షాపులవాళ్ళతో రాజీపడి పాకింగ్ కూడా అక్కర్లేదని చెప్పి ఆ సామాన్లు అలాగే ప్లాస్టిక్ కవర్లల్లో పడేసుకుని స్టేషనుకి వెళ్ళి రైలెక్కి స్థిమితపడ్డాం. ఈ హడావిడిలో మేము ''భీమాస్''లోంచి రాత్రికి భోజనంగానీ టిఫినుగానీ పాక్ చేయించుకుందామనుకున్న విషయం కూడా మర్చిపోయాం.

వేసంకాలం అవడంతో వెయిటింగ్‌లిస్టులో వున్న మా ఎ.సి. స్లీపరు బెర్తులు కన్ఫర్మ్ కాలేదు. దానితో మామూలు స్లీపర్లోనే ప్రయాణం, అలవాటులేని పని. తెల్లవారగట్లనించి తిరుగుడే తిరుగుడు. ఎండంతా మాపరం. స్నానం చేయడానికి కూడా వీలుపడలేదు. పైపెచ్చు ఎన్ని ప్రసాదాలు తిన్నా మామూలు భోజనం చేయలేదు అని అనుకోవడం వల్ల కలిగిన మానసిక నీరసం, గోవిందరాజుల గుడి దగ్గర షాపు వాళ్ళ చేతిలో మోసపోయామేమోనన్న అనుమానం. రైలు బోగీనిండా జనం, ఇంక చిరాకు భరించలేక పెట్టెలోంచి దూకేద్దామా అన్నంత అసహనం కలిగింది. రైలు బయలుదేరగానే గుమ్మం దగ్గరున్న కుర్రాళ్ళు ''అరెరె! ఎవరో పాపొస్తోందిరా!'' అని అరుస్తూ గొలుసు లాగారు. రొప్పుకుంటూ రోసుకుంటూ ఒక ఇరవైఏళ్ళ పిల్ల చేతిలో పెద్ద టిఫిను కారియరు, భుజాన సంచితో సహా వచ్చి రైలెక్కింది. అప్పటికే మా బోగీ ప్లాట్‌ఫారం దాటేయడంతో కుర్రాళ్ళు చేయందించి ఆ పిల్లని పైకి లాగారు.

''ఏం చెల్లెమ్మా! రైలెందుకోలేకపోయేదానివి కదా! టయానికి రావద్దూ'' అని ముద్దు ముద్దుగా కేకలేస్తూ పలకరించారు. కుర్రాళ్ళకి కూడా, కొంత మందిని చూస్తే 'చెల్లెమ్మా' అనాలనిపిస్తుంది కాబోలు. ఆ అమ్మాయి వాళ్ళకేసి చూసి థ్యాంక్సన్నట్టుగా దణ్ణం పెట్టి ఏమీ మాట్లాడకుండా మా పక్కన కూర్చుంది. పరుగెత్తుకుంటూ వచ్చిందేమో కొద్దిగా బొద్దుగా వుండబట్టి కాసేపు సైలెంట్‌గా ఆయాసపడింది. బ్రౌన్ కలర్‌లో వున్న కాటన్ పంజాబీడ్రెస్సు, పెద్ద జడ, దాంట్లో ఓ చిన్న మందారపువ్వు, నుదుట చిన్న స్టిక్కరు బొట్టు దానికిందగా కుంకుమబొట్టు, మెడలో వెంకటేశ్వరస్వామి లాకెట్టున్న చిన్న గొలుసు, చేతికి మట్టిగాజులు. ఆ అమ్మాయి వరస చూస్తే రోజూ రైల్లో ప్రయాణం చేసే టైపు లాగానే వుంది. ఎవరితోటి ఏమీ మాట్లాడకుండా సంచిలోంచి ఒక పుస్తకం తీసి చదువుకుంటూ కూర్చుంది. పైన అట్టవేసి వుండడం వల్ల అది ఏ పుస్తకమో తెలియలేదు. బహుశా ఏ టెన్తుక్లాసుకో కడుతోందేమో చదువుకుంటోందనుకున్నాను.

రైలు రేణిగుంటలో ఆగినపుడు ఏదయినా కొనుక్కుందాం అనుకున్నాం గాని ఆ పరిసరాలు చూస్తే కొనబుద్ధి కాలేదు. ఇంక రైలు బయలుదేరాక కాసేపటికి ఆ వేడితగ్గి హాయిగా అనిపించింది. తప్పదని తెలిశాక పరిసరాలకి రాజీపడి అందులోనే ఎంతో కొంత సుఖాన్ని వెతుక్కోవటం మానవనైజం కదా! అంతా బాగానే వుందిలే అని అనుకున్నానో లేదో మాతో వచ్చిన లత ''నే కొందామనుకున్న ఇత్తడి సింహాసనం బేరమూ కుదర్లేదు, ఇటు భీమాస్‌లో టిఫిను తీసుకోవడమూ కుదరలేదు. అంతా మీమూలాన్నే'' అని నన్ను డిస్టర్బ్ చేసింది. దాంతో నాకు వళ్ళు మండిపోయి ''అన్నిటికీ నన్ననద్దు. అసలు యాత్రాస్థలాల్లో ఏదన్నా కొందామనుకోవడమే తప్పు! నీకసలు చురుగ్గా ఏ పని చేయడమూ రాదు! నేను కొనుక్కోలే మూడు వేలుపెట్టి- ఇత్తడికుందులూ తోరణదీపాలూ? తెలిసన్నా వుండాలి లేదా ధైర్యమన్నా వుండాలి. ఈ పాటిదానికి ఆస్తులన్నీ పోతాయేమోనని ఆలోచిస్తూ కూచుంటే అంతే అవుతుంది'' అన్నా. ఆ రకంగా ఇద్దరం వాదించుకోవడంలో ఒక పావుగంట టైము గడిచింది. రాత్రి భోజనాలు సప్లై చేస్తారా అని ఏ కుర్రాడ్నీ కనుక్కోకపోవడంతో గుండెల్లోరాయి పడింది. మాతోబాటు వచ్చిన సీతాలక్ష్మికి కొద్దిగా షుగరుందని డాక్టరు అనుమానంగా చెప్పాడుట. వేళకి తినకపోతే ఏదో అయిపోతానని తనకి భయం. ''లతా! ఇందాకా రేణిగుంటలో ఏదో ఒకటి కొన్నా సరిపోయేది. నీట్‌గా లేదని నువ్వు కొననీయలేదు! నాకు మధ్యరాత్రిలో కళ్ళు తిరుగుతాయేమో! ఈ విషయం తెలిస్తే మా ఆయన నన్ను మళ్ళీ ఎక్కడికీ పోనీయ్యడు'' అంటూ రాబోయే ఆపదను తల్చుకుని ఓవర్ యాక్షన్ చేయడం మొదలుపెట్టింది. ''అమ్మా తల్లీ! పొద్దున్నించీ అన్నం అంటే తినలేదు గానీ ఆరాగా అన్ని గుళ్ళల్లో ప్రసాదాల పేరుతో బాగానే లాగించాం కదా! నాలుగు రోజులకి సరిపడా న్యూట్రిషన్ అందింది. నువ్వేం కళ్ళు తిరిగి పడిపోవు! నెల్లూరు స్టేషన్లో పళ్ళు దొరుకుతాయేమో చూద్దాం'' అని ఆవిడకి ధైర్యం చెప్పాను. కటువుగా చెప్తేగానీ మావాళ్ళు వినిచావరు మరి. ఇలా మేం తర్జన భర్జన పడుతుండగా ఆ అమ్మాయి పుస్తకంలోంచి తల ఎత్తి ''నేను చాలా శుభ్రంగా ఇంట్లో చేసి తీసుకువచ్చానండి. ఈ కాన్‌లో ఇడ్లీలున్నాయి. ఏడయ్యాక పెట్టడం మొదలుపెడదామనుకున్నాను'' అని చెప్పింది. ఆ పిల్ల మాటకి ఏం జవాబు చెప్పాలో తోచలేదు.

ఒక పావుగంట పోయాక భుజాన వున్న సంచిలోంచి పేపరు ప్లేట్లు తీసింది. కాన్ మూతతీసి చూస్తే దాన్నిండా పెద్ద పెద్ద తెల్లటి ఇడ్లీలు. ఇంకా వేడిగానే వున్నట్టున్నాయ్. ఒక వందపైగానే వుండుంటాయి. తన భుజానవున్న సంచిలోంచే ఒక మాగాయి సీసా, నేతిసీసా తీసింది. ఒక్కొక్క ప్లేటులో నాలుగేసి ఇడ్లీలు పెట్టి నెయ్యి, మాగాయి వేసి మా ముగ్గురికీ ఇచ్చింది. ముగ్గురం తినడం మొదలుపెట్టాం. మాగాయి తింటుంటే అచ్చు మా అమ్మమ్మ చేసినట్టుగా అనిపించి అదే ముక్క ఆ అమ్మాయితో చెప్పా! ఈ మాగాయి కూడా మా అమ్మమ్మ చేసిందేనండి అంటూ నవ్వుతూ ఇంకో రెండు ఇడ్లీలు వేసింది. మేం తినడం అయిపోయిందనుకోగానే తన క్యాను, సంచీ తీసుకుని పక్క క్యాబిన్లోకి వెళ్ళిపోయింది.

అబ్బ! రైల్లో తిరుగుతూ ఇడ్లీలమ్ముకునే అమ్మాయయినా ఎంత హుందాగావుంది! అసలు రైళ్ళల్లోనూ

## కొత్త హాట్‌బేబి.. మౌసమీ ఉదేషి



మోడల్, బాలీవుడ్ నటి మౌసమీ ఉదేషి తెలుగు తెరకి పరిచయమవుతోంది. 'మంత్ర' టీమ్ తీసే కొత్త సినిమాలో ఈమె కనిపించబోతోంది. మోడల్స్ అందరిలాగానే ముంబై నుంచి ఇక్కడ అడుగిడింది. 5 అడుగుల ఆరు అంగుళాలు పొడవుండి, 35-26-37 అందాల కొలతలు కలిగిన ఈ భామిని, ఛార్మీని మించి అందాలు ఆరబోయడానికి ఏమాత్రం వెనుకాడడం లేదని చెప్పడానికి ఈ ఫోటో సరిపోదూ? ఈ చిత్రంలో శివాజీ కథానాయకుడు.

ఇడ్లీలమ్మేవాళ్ళు నేయ్యేస్తారా? కొబ్బరి సెనగ పిండి కలిపి చారులాంటి పచ్చడోటిచేసి పోస్తారు కదా! మరి ఈ అమ్మాయి ఇంత మంచి వూరగాయ వేసి పెట్టింది? ఎంత తీసుకుంటుందో! ఎలా గిట్టుబాటవుతుందో మరి! నిజంగా ఆ పిల్ల పట్టుదలకి జోహార్లర్పించవచ్చు. ఇలా రోజూ రైల్లో కొంత దూరం ప్రయాణంచేసి ఇడ్లీలమ్మి తిరుగురైల్లో తిరుపతి వెళ్ళిపోతుంది కాబోలు. ఆడపిల్లలు ఎంత కష్టపడుతున్నారో కదా! ఇంకా పెళ్ళి అవని చిన్నపిల్లకి ఇంత కష్టపడవలసిన అవసరం ఏమొచ్చిందో!

భోజనాల సమస్య తీరిపోయాక ముగ్గురం కూచుని రకరకాల కబుర్లు చెప్పుకున్నాం. పడుకోబోయే ముందు మళ్ళీ ఆ అమ్మాయి సంగతి గుర్తొచ్చింది. ''అయ్యో! అదేమిటీ! పాపం ఆరేసి ఇడ్లీలు నేయ్యేసి కూడా పెట్టింది. డబ్బులకోసం రానేలేదు. కొంపతీసి ఏ టి.సి అన్నా బలవంతంగా దింపేశాడా? అయ్యో మనం ఋణపడిపోయినట్టేనా?'' అని తెగ బాధపడిపోయాను. ''వస్తుందండీ! ఎక్కడో తిరుగుతూ ఆ మిగిలినవి ఖాళీచేస్తూ వుండుంటుంది. అలా ఎవరూ ఏవీ దింపెయ్యరు. వాళ్ళకీ వాళ్ళకీ బోలెడు లావాదేవీలుంటాయి'' అని అన్నీ తెలిసినదానిలాగా సీతాలక్ష్మి స్టేట్ మెంటిచ్చింది.

నాకు ఇంట్లో ఎనిమిదయినా పూర్తి మెళకువ రాదు. రైల్లో మాత్రం అయిదింటికే మెళకువ వచ్చేస్తుంది. అప్పటికే లత ముఖం కడుక్కుని వస్తూ వస్తూ వుత్సాహంగా ''మనం ఎవరికీ ఋణపడక్కర్లేదండోయ్! ఆ అమ్మాయి చివర కాబిన్లో సైడ్ అప్పర్ బర్తు మీద హాయిగా నిద్రపోతోంది. ఎవరన్నా గుంటూర్లో దిగిపోతే ఆక్రమించిందేమో. ఆ అమ్మాయిని లేపి కాసేపాగి రమ్మని చెప్పివచ్చా'' అంది. ఇంకో పదినిమిషాల్లో రైలు సికింద్రాబాదు చేరుతుందనగా ఆ అమ్మాయి నీటుగా తయారయి తన క్యారియరు, బాగుతో సహావచ్చి మా పక్కన కూర్చుని ''నమస్తే మేడం'' అంది.

''ఎక్కడికెళ్ళావమ్మా? రాత్రి మళ్ళీ కనిపించనేలేదు! మధ్యలోనే దిగిపోయావేమోననుకున్నాం! నీ పుణ్యమాని మేం రాత్రి హాయిగా నిద్రపోయాం'' అన్నాను.

''దానిదేముందండి! అలా సేవ చేయకలగడం నా అదృష్టం'' అంది. అమ్మో బాగానే మాట్లాడుతోందే అనుకుని 'నీ పేరేమిటి? రోజూ ఇలాగే అప్ అండ్ డౌన్ చేస్తుంటావా?'' అని అడిగాను.

''బాల అంటారండి. బాలా త్రిపుర సుందరి పూర్తి పేరు. రోజూ కాదుగానీ ఈ మధ్య తరచూ ఈ రైల్లో ప్రయాణాలు తప్పట్లేదు. మా నానమ్మగారికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో నేను తిరగాల్సి వస్తోంది. కాలేజీ కూడా పోతోంది'' అంది.

''కాలేజా! ఏ కాలేజి?''

'' ఎస్.వి యూనివర్సిటీ కాలేజి అండి. ఎమ్.ఎ మ్యాథ్స్ చదువుతున్నా. సెమినార్లో మీ ముగ్గురినీ చూశాను. ఫస్టియరు ఆఖరి పరీక్ష రాసి వస్తున్నా'' అంది. మేం అందరం ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుని సద్దుకుని కూచున్నాం. ఇంతలోకీ నిన్న సాయంత్రం చైను లాగి రైలు ఆపిన ఆ కుర్రాళ్ళు ''థాంక్యూ సిస్టర్! మళ్ళీ ఎప్పుడన్నా కలుద్దాం'' అని అంటూ గుమ్మం దగ్గర నిలబడి వెళ్ళేవాళ్ళకి వీడ్కోలు చెప్పేందుకు వెళ్ళిపోయారు.

''వీళ్ళంతా మీ కాలేజి పిల్లలా?'' అని ఆరా తీశాను.

''లేదు. వీళ్ళందరూ హైదరాబాదులో ఇంజనీరింగ్ కాలేజి స్టూడెంట్స్. దర్శనానికని తిరుపతి వచ్చారుట. మీకు మల్లేనే వాళ్ళక్కూడా నేనే రాత్రి ఇడ్లీలు పెట్టాను. మొత్తం మూడు బోగీలు తిరిగి అన్నీ అవగొట్టాను'' అంది.

''మొత్తానికి గట్టిదానివే! ఓ మూల పరీక్షరాసి వచ్చానంటున్నావ్! ఇంకో పక్క ఇడ్లీలు చేసి తెచ్చానంటున్నావ్! ఒక్కదానివీ ఎలా చేశావ్! పాపం!

తను నవ్వుతూ ''నాకు చిన్నప్పట్నించీ పని అలవాటుండండి. మా అమ్మగారు గవర్నమెంటు ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా పనిచేస్తుండడం వలన చేయవలసి వచ్చేది. మా నాన్నగారికి ఒక వూళ్ళో, మా అమ్మగారికి ఒక వూళ్ళో పోస్టింగులు. నేను, అన్న, అమ్మ ఒక చోట వుండేవాళ్ళం. శని ఆదివారాలు వస్తే ప్రయాణాలు తప్పేవి కావు. హాస్టల్లో వుంచేందుకు తాతగారు ఒప్పుకునేవారు కారు'' అంది.

''మరి మీ అమ్మగారు డాక్టరయితే నువ్వు డాక్టరవకుండా మ్యాథ్స్ చదువుతున్నావే?''

''మా ఇంట్లో అందరూ, అంటే మా పేరెంట్సు, బాబాయిలు, పిన్నిలు, అత్తలు, తాతగారు అందరూ డాక్టర్లే. మా అమ్మ రెండేళ్ళు అమెరికా వెళ్ళినప్పుడు నేను నాన్నమ్మ దగ్గరే పెరిగాను. ఆవిడ రోజూ నాతో 'నువ్వు మాత్రం డాక్టరు చదవకే. రోజూ ఇంట్లో రోగాల కబుర్లే. అంతే వుండదు. నిద్రా వుండదు'' అనేవారు. నా మనసులో అదే నిలబడిపోయింది. అందుకే నేను బయాలజీ తీసుకోలేదు. నానమ్మగారికి ఏడాదినించీ బాగుండడంలేదు. నన్ను చూడాలనిపించినపుడల్లా వెళ్ళివస్తున్నాను'' అంది.

''మీ ఇంటిపేరు ఏమిటి?'' అనడిగా.

''తల్లావఝుల వారు''

''మరి తల్లావఝుల రామ బ్రహ్మంగారు- కాన్సరు రామబ్రహ్మంగారు మొన్న పద్మభూషణ్ వచ్చిందే. ఆయన ఏమవుతారు మీకు?

''ఆయనే మా తాతగారండి''

''వారి మనవరాలివా! ఎంత అదృష్టవంతురాలవమ్మా! మరి ఈ ఇడ్లీలేమిటి?''

ఏం చెయ్యను! ప్రశ్నలడక్క తప్పట్లేదు. ఎంతవరకడిగితే అంత వరకే చెప్తోంది. మరి ఎంతైనా లెక్కల స్టూడెంటు కదా.

''అంటే నానమ్మగారిని చూడ్డానికి అమ్మా నాన్న మొన్ననే బయల్దేరి వెళ్ళిపోయారు. నన్ను పరీక్ష అయిపోయాక రమ్మనిచెప్పి నా బట్టలు కూడా అమ్మ తన పెట్టెలోనే పెట్టి తీసికెళ్ళిపోయింది. నిన్న పరీక్షరాసి ఇంటికొచ్చేటప్పటికి నాన్నగారు ఫోన్ చేసి ''ఎన్నాళ్ళు వుండాల్సి వస్తుందో తెలియదు. ఫ్రిజ్జు అవీ ఖాళీచేసి అన్నీ జాగ్రత్తగా తాళాలు వేసుకురా'' అని చెప్పారు. ఫ్రిజ్జులో చూస్తే పెద్ద గిన్నెడు పిండి కనిపించింది. అమ్మ వారానికోసారి ఇడ్లీ పిండి రుబ్బించి వుంచుతుంది. వూరికే పారేయడం ఎందుకు. ఇడ్లీలు చేసి పట్టుకొస్తే, రైల్లో ఆకలేసిన వాళ్ళకి పెట్టొచ్చు కదాని గబగబా వండాను. పచ్చడి చేద్దామంటే కొబ్బరిలేదు. అందుకని మాగాయి తీసుకొచ్చాను. ఇవన్నీ సద్దుకోడంతో లేటయిపోయి పరిగెత్తాల్సి వచ్చింది'' అని పాపం పచ్చడి చేయలేకపోవడానికి సంజాయిషీ ఇచ్చింది.

నిర్ఘాంతపోయి మాట్లాడకుండా వుండిపోయాం. ''ఈ రోజుల్లో ఆడ పిల్లలు కాలేజి కబుర్లు, ఫ్యాషన్లు, సెల్‌ఫోన్లు, అబ్బాయిలు, సినిమాలు షికార్లు, అమ్మల మీద హయాలు- ఇవే చూస్తున్నాం గానీ ఇలా బయటవాళ్ళ గురించి ఆలోచించి పనిచేసే వాళ్ళున్నారా? ఇలా ఆణిముత్యాల్లాంటి చిట్టి తల్లులు పుడుతున్నంత కాలం మనదేశానికొచ్చిన ప్రమాదం ఏమీలేదు! ఇంకా న యం! తొందరపడి ఎంతివ్వమంటావని అడిగాం కాదు. జన్మంతా సిగ్గుపడి చచ్చేవాళ్ళం'' అనుకున్నాం మనసులో.

''చిన్న పిల్లవయినా పెద్దమనసుతో ఆలోచించావమ్మా. ఎప్పటికీ ఇలాగే వుండు. పెద్దవాళ్ళం కదా థాంక్సు చెప్పకూడదు. నీకు మంచి భర్తనివ్వమని దేవుడ్ని అడుగుతాం సరేనా?'' అన్నా.

''థాంక్స్ ఆంటీ!'' అని మాకే తను థాంక్స్ చెప్పి బోగీ బయట నిలబడి చెయ్యూపుతున్న పెద్దమనిషితో కలసి వెళ్ళిపోయింది. నా ప్రాణానికి ఆ బాల సాక్షాత్తూ కాశీ అన్నపూర్ణలా కనిపించింది.

*



## హీరోగా 'బోయ్'

శంకర్ సినిమా 'బోయ్స్'లో ఒకడిగా కనిపించిన నకుల్ త్వరలో హీరో కాబోతున్నాడు. దాని కోసం అతడు జిమ్‌చేసి స్లిమ్‌గా రెడీ అయ్యాడని కోలీవుడ్ సమాచారం. బోయ్స్ తర్వాత ఈ బోయ్ కలుగులోకి వెళ్ళి ట్రిమ్ అయి హీరోగా తెరమీదికి రావడానికి యత్నించడంపైనే ఇప్పుడంతా చర్చించుకుంటున్నారు. 'కాదలిల్ విఝున్‌దెయిన్'తో తమిళ్‌లో ఆరంగేట్రం చేసిన ఇతను 'నక్కా ముక్కా' అంటూ యూత్ స్టోరీలోనూ నటించాడు. 'బోయ్స్' కొత్త లుక్కునూ తెచ్చిపెట్టింది. ఇతగాడికి అజిత్ సినిమాలంటే బోలెడంత ఇష్టమట. ఇంతకీ ఈ నకుల్ ఎవరో తెలుసా? హీరోయిన్ దేవయాని తమ్ముడు.